## ధాన్యం కొనడం లేదని రైతుల రాస్తారోకో

నవతెలంగాణ-రామాయంపేట



కల్లాలకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని నిరసిస్తూ రైతులు రాస్తారోకోకు దిగారు. మండల పరిధిలోని ప్రగతి ధర్మారం గ్రామంలో రైతులు ఆందోళన చేపట్టారు. గురువారం రామాయంపేట గజ్వేల్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసుకుని ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, పిఎసిఎస్ చైర్మన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

# మెదక్

శుక్రవారం | 17 మే 2024 | www.navatelangana.com


## అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యం

- ఆందోళనలో అన్నదాతలు

నవతెలంగాణ- కొల్చారం



మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిముద్దయింది. రంగంపేట సహాకార సంఘం ఆవరణలో అమ్మకానికి నిల్వ ఉంచిన వడ్లు వర్షం పడటంతో తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు తీవ్ర తంటాలు పడ్డారు. అలాగే తూకం వేసిన సంచులు, ధాన్యం కుప్పలు తడవకుండా ఉండేందుకు రైతులు అష్టకష్టాలు పడి టార్పాలిన్లు కప్పారు. మరికొన్ని చోట్ల ఈదురు గాలులతో మామిడి కాయలు నేలరాలాయి.

## అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-మునిపల్లి

రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ హెచ్చరించారు. మండల పరిధిలోని బుదేరా రైతు వేదిలో మండలంలోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లు, వ్యవసాయాధికారులతో గురువారం సమీక్షా సమా వేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించడంతో పాటు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. అలాగే డీలర్లందరూ లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, లేని పక్షంలో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామ న్నారు. అదే విధంగా రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తోనే ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. బీటీ-3 రకం పత్తి విత్తనాన్ని ఎవరూ కూడా విక్రయించొద్దని సూచించారు. అధికారులందరూ తమ తమ రైతు వేదికలల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రైతుబంధు, రైతు బీమా, పంటల నమోదుకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వానాకాలం పంటల నమోదు ప్రక్రి య కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండల వ్యవసాయ అధికారి శివ కుమార్, ఎస్ఐ సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య,స్నేహ,రెహమాన్, మహేందర్, డీలర్లు పాల్గొన్నారు.20

## ఘనంగా మారోజు వీరన్న 25వ వర్ధంతి

నవ తెలంగాణ-సిద్దిపేట

కులవర్గ జమిలి పోరాటాల సిద్ధాంతకర్త కామ్రేడ్ మారోజు వీరన్న 25వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బహుజన కమ్యూనిస్టు పార్టీ , బి డి ఎస్ ఎఫ్, బహుజన మహిళా సంఘం, బి ఎఫ్ టి యు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బి ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు చిట్యాల మధు, సీనియర్ ఉద్యమ నాయకులు సత్తయ్య లు మాట్లాడుతూ ఆయన దళిత ఉద్యమాలు, మండల్ ఉద్యమం, తెలంగాణ సాధన ఉద్యమాలలో మమేకమైనారన్నారు. చారిత్రక అస్తిత్వ ఉద్యమమైన లాల్ నిల్ నినాదంతో అనేక కుల సంఘాలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మాదిగ హక్కు దండోరా), లంబడి హక్కుల పోరాట సమితి, గొల్ల కురుమ డోలు దెబ్బ, సాకిరేవు (చాకలి) దెబ్బ, మోకి దెబ్బ (గౌడ), గన్నుదెబ్బ(వడ్డెర), మాల గుతుప దెబ్బల పేరుతో సంఘాలను కామ్రేడ్ మారోజు వీరన్న నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనంద్, ప్రజా సంఘాల నాయకులు దుర్గా రాములు, సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్, సాడిమల డేవిడ్, గాలి రాజేష్, బహుజన మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కొండ వర్ష, మారోజు వీరన్న సహచరులు గడ్డం మోహన్ రెడ్డి, దప్పు చంద్రం, సిద్దిపేట నియోజకవర్గ ముదిరాజ్ జెఏసి చైర్మన్ పడిగే ప్రశాంత్, రావుల రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ప్రేమికుడే తీసుకువెళ్లి చంపేశాడని బంధువుల ఆరోపణ

2టౌన్ పోలీస్ స్టేషన్ ముందు మృతురాలి బంధువుల ఆందోళన

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్



అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే మండలం పరిధిలోని చంద్లాపూర్ గ్రామంలో ఉన్న రంగనాయక సాగర్‌లో బుధవారం రాత్రి యువతి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, ఆమెను సిద్దిపేట పట్టణం శంకర్ నగర్‌కు చెందిన ఇరుగదిండ్ల అశ్విని (22)గా గుర్తించారు. ఆమె రెండు రోజులుగా కనిపించడం లేదంటూ వారి కుటుంబ సభ్యులు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అదే సమయంలో ఆమె రంగనాయక సాగర్‌లో మృతి చెందినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. అయితే ఆ యువతి సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన శ్రావణ్ అనే యువకుడితో ప్రేమలో పడి, 13వ తేదీన ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె మిస్సింగ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో పోలీస్ స్టేషన్‌లోఆ రోజే ఫిర్యాదు చేసి యువకుడు ఇంటికి సైతం వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ యువకుడు ఉండడం అమ్మాయి దొరకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి అమ్మాయి మరణించినట్లు తెలిసింది. తమకు సరైన న్యాయం చేయాలని కోరుతూ సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మృతురాలి బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు

## ఏసీబీ వలలో అవినీతి వ్యవసాయ అధికారి

రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

నవతెలంగాణ- నర్సాపూర్




రూ.30 వేల లంచం తీసుకుంటూ వ్యవసాయ మండలాధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వైన్యం మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది ఇందుకు సంబంధించిన ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర క్యాంప్ గ్రామానికి చెందిన వంగ నారేన్ ఎంఎస్ శివశక్తి ట్రేడ్ లైసెన్స్ నర్సాపూర్ పేరుతో ఫార్వార్డ్ చేయడం కోసం నర్సాపూర్ మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ రూ.30వేలు లంచం ఇవ్వాలని బాధితుడు నరేన్‌ను డిమాండ్ చేశాడు. దీంతో విసుగు చెందిన బాదితుడు వంగ నరేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం నర్సాపూర్ వ్యవసాయ కార్యాలయంలో బాదితుని నుంచి లంచం తీసుకుంటున్న క్రమంలో ఏసీబీ అధికారులు ఏసీబీ డిఎస్పీ మెదక్ రేంజ్ కె.సుధార్శన్, ఇన్స్పెక్టర్లు వెంకట రాజాగౌడ్, రమేష్ లు రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఏసీబీ డిఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ఏవో అనిల్ కుమార్ హైదరాబాద్ యాంటీ కరప్షన్ బ్యూరో అధికారుల అదుపులో ఉన్నట్లు తెలిపారు.

## దంతపల్లి శివారులో పశువుపై చిరుత దాడి

నవతెలంగాణ-రామాయంపేట

లేక దూడపై చిరుత దాడి చేసి చంపేసిన ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని దంతపల్లి గ్రామంలో జరిగింది. దంతేపల్లి శివారులో చిరుతపులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామానికి చెందిన నకిర్తి బూదవ్వ అనే రైతుకు చెందిన లేగదూడపై రాత్రి చిరుత దాడి చేసి చంపేసింది. దీంతో రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చిరుత పులిని బంధించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# వర్షం.... పంట నష్టం



- వరుస వర్షాలతో తడుస్తున్న ధాన్యం
- నేలవాలిన అరటీ తోటలు...రాలిన మామిడి
- వరద నీటిలో ధాన్యం రాసులు
- ఎన్నికల విధుల్లో పడి పర్యవేక్షణ మర్చిన అధికారులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని పరిశీలించిన సంగారెడ్డి కలెక్టర్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అకాల వర్షాలు పంటలకు అపార నష్టాన్ని చేకూరుస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయం నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండడంతో యాసంగీ పంటలకు తీరని నష్టం వాటిల్లుతుంది. మార్కెట్‌లో పోసిన ధాన్యం రాసులు తడిసి ముద్దవుతున్నాయి. రంగుమారి, మొలకొస్తున్నాయి. మరో పక్క వాణిజ్య పంటలైన అరటి చెట్లు నేలకొరిగి దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోతున్నాయి. పలు చోట్ల మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. చెట్లు విరిగిపోవడం, విద్యుత్ స్థంబాలు కూలిపోవడంతో కూడా నష్టం వాటిల్లుతుంది. ఫిబ్రవరి, మార్చిలో కురిసిన వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, ఉల్లిగడ్డ, మామిడి వంటి పంటలకు నష్టం వాటిల్లింది. ఆ పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపినప్పటకీ ఇప్పటి వరకు పంట నష్టపరిహారం అందలేదు. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం, ఇతర పంటలకు నష్టం జరుగుతుండడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

### అకాల వర్షాలతో అపార నష్టం

ఉమ్మడి మెదక్ జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో పంటలకు అపార నష్టం ఏర్పడుతుంది. ఏప్రిల్ మాసంలో తరచూ వర్షాలు పడ్డాయి. మే నెలలోనూ వర్షాలు కురుస్తున్నారు. ఈ నెల మొదటి రోజు నుంచి ఇప్పటి వరకు రెండో రోజులకోసారి వర్షం కురుస్తునే ఉంటుంది. బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. మోస్తరు నుంచి భారీ వర్షం పడడంతో వివిద రూపాల్లో నష్టం ఏర్పడుతుంది. ముఖ్యంగా యాసంగీ సీజన్ ధాన్యం మార్కెట్లలో ఉంది. మెదక్ జిల్లాలో ఇంకా పావొంతు వరి కోతల పనులు సాగుతున్నాయి. పలు చోట్ల వాణిజ్య పంటలైన అరటీ, మామిడి, నిమ్మ, మొక్కజొన్న, ఉల్లిగడ్డ వంటి పంటలకు కూడా నష్టం వాటిల్లుతుంది. ఈ నెల 12న భారీ వర్షం పడింది. గురువారం కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలమైన గాలులు వీచి వర్షం పడింది. దీంతో కోహీర్ మండలంలోని బిలాల్పూర్ ఇతర గ్రామంలో ఐదారు ఎకరాల్లో అరటి తోటలో చెట్లన్నీ నేలకొరిగి దెబ్బతిన్నాయి. అరటి తోట పంట కొచ్చే దశలో చెట్లన్నీ విరిగి నేలవాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో మొక్కజొన్నపంట సాగైంది. వర్షాలు, గాలుల వల్ల పైర్లు వంగిపోతున్నాయి. కంకులు దెబ్బతింటున్నాయి. ఆలస్యంగా పూతకొచ్చిన మామిడి తోటల్లో కాయలు రాలిపోతున్నాయి. ముఖ్యంగా పచ్చడి కాయలు మార్కెట్ డిమాండ్‌ను బట్టి తెంపుతారు. వర్షం, బలమైన గాలులు వీయడంతో కాయ విపరీతంగా రాలిపోయి రైతులు నష్టపోతున్నారు. సంగారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, వర్గల్, కంది, సదాశివపేట, నర్సాపూర్ తదితర మండలాల్లో మామిడి రైతులు నష్టపోయారు. గురువారం కురిసన వర్షానికి గజ్వేల్, సంగారెడ్డి పట్టణాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని చోట్ల విద్యుత్ స్థంబాలు వరిగాయి.

### మార్కెట్లో తడుస్తున్న ధాన్యం రాసులు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయి. మార్కెట్‌లో ధాన్యం పోసి నెల రోజులైనా కాంటా వేయకపోవడంతో రాసులు అక్కడే ఉండిపోతున్నాయి. ఇప్పటికే ఐదారు సార్లు వర్షాలు పడడంతో రాసులన్నీ తడుస్తున్నాయి. కింది భాగంలో వరద నీరు చేరి వడ్లు మొలకొస్తున్నాయి. ఆరబోసిన ధాన్యం తడవడం వల్ల రంగు మారిపోతుంది. ఐకేపీ, పీఎసీఎస్ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలన్నీ కూడా ఒపెన స్థలాల్లోనే పెట్టారు. నేల చదునుగా వంపు మిట్టలుగా ఉంది. దీంతో రైతులు పోసిన ధాన్యం రాసులన్నీ వరద నీటితో తడుస్తున్నాయి. రైతులు వర్షాలు పడినప్పుడల్లా కల్లాల వద్ద పడిగాపులుగాచి పట్టాలు కప్పడం, ఆరబోసిన వడ్లను రాసి పోయడం కోసం తిప్పలు పడాల్సి వస్తుంది. మండుటెండ కాసి అంతలోనే వాతావరణంలో మార్పులొచ్చి వర్షం కురుస్తుంది. బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో ధాన్యం రాసులపై కప్పిన పట్టాలు కొట్టుకుపోయి ధాన్యం తడుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కురిసిన వర్షానికి కొల్చారం, చిలిపిచెడు, నర్సాపూర్, కౌడిపల్లి, తూప్రాన్, మెదక్, హవేళీ ఘన్‌పూర్, పాపన్నపేట, రామాయంపేట, నార్సింగ్, శంకరంపేట, సంగారెడ్డి, హత్నూర, కంది, సదాశివపేట, కొండాపూర్, పుల్కల్, జోగిపేట, వట్‌పల్లి, నారాయణఖేడ్, న్యాల్‌కల్, జహీరాబాద్, గజ్వేల్, వర్గల్, సిద్దిపేట, మర్కుక్, మద్దూరు, కొమురవెల్లి, చేర్యాల వంటి ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ధాన్యంపు రాసులు తడిసిపోయాయి. అనేక చోట్ల లారీల సమస్యతో కాంటా వేసిన ధాన్యం రవాణా చేయకపోవడంతో బస్తాలన్నీ తడిసిపోయాయి.

### ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్లు

వర్షాల వల్ల ధాన్యం తడిసి నష్టమేర్పడుతున్నందున రైతులు రోడ్లెక్కి ఆందోళన చేశారు. చిలిపిచేడు, రామాయంపేటలో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. లారీల సంఖ్య పెంచి కాంటా వేసిన ధాన్యాన్ని ఎగమతి చేయాలని కోరారు. నెల రోజులైనా కాంటా వేయక పోవడంతో వర్షాలకు ధాన్యం తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంగా రెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం కంది మండల కేంద్రంలోని పీఎసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యాన్ని వెంట వెంట కాంటా వేసి మిల్లులకు రవాణా చేయాలని ఆదేశించారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కూడా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్, చండూర్, కొల్చారం మండలంలోని చిన్న ఘన్‌పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం రవాణా కోసం అదనపు వాహనాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్ల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### ధాన్యం కొనుగోలు వేగం చేయాలి: సీపీఎం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కార్యదర్శులు జి.జయరాజ్, మల్లేశం, మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు జోక్యం చేసుకుని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. లారీలు, హమాలీల కొతర లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## బిల్డింగ్ శ్లాబ్ కూలడంతో వ్యక్తి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ గంగాధర్

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం







(ఫైల్)

బిల్డింగ్ శ్లాబ్ కూలి ఓ వ్యక్తి మృతి చెందగా.. అతని భార్య కుమారుడితోపాటు బిల్డింగ్‌లోని రెండో అంతస్తులో నిద్రిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మినగర్‌లో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. లక్ష్మినగర్‌లో ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తికి మూడం తస్తుల బిల్డింగ్ ఉన్నది. అందులోని రెండో అంతస్తులో దీపాంకర్ దాస్ అనే వ్యక్తి ఉంటున్నాడు. అయితే బుధవారం అర్ధరాత్రి ఆ బిల్డింగ్ శ్లాబ్ కూలి రెండో అంతస్తులోని దీపాంకర్ దాస్‌పై పడి.. అక్కడి నుంచి పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై కూలింది. దాంతో రేకుల షెడ్డులో నిద్రిస్తున్న జయదేవ్(50), అతడి భార్య సబితా, కుమారుడు రాకేష్‌లకు తీవ్ర గాయలవ్వగా.. జయదేవ్ అక్కడికక్కడే మృతి చెందా డు. సబితా, రాకేష్, పై అంతస్తులోని దీపాంకర్‌దాస్‌కు తీవ్ర గాయాలు కాగా.. స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆసు పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని సిఐ గంగా ధర్ పరిశీలించారు. బిల్డింగ్ యజమాని ప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

**బిల్డింగ్ కూలి ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు**

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని పలు కాలనీల్లో గతంలోనూ చాలా చోట్ల బిల్డింగ్‌లు కూలి మృతి చెందారు. అయినప్పటికీ అధికారులు శిథిలావస్థ బిల్డింగ్‌ల తొలగింపు చేపట్లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావుడి చేసి.. ఆపై అటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నార ు. పాతబడిన, కూలిపోయే బిల్డింగ్‌లను గుర్తించి వారిని సు రక్షిత ప్రాంతానికి తరలించే బాధ్యత మున్సిపల్ టౌన్ ప్లాని ంగ్ అధికారులదే అయినప్పటికీ.. నోటీసులు జారీచేసి చేతు లు దులుపుకుంటున్నారని ఆవేదన చెందుతున్నారు.

**సమస్యలు పట్టని మున్సిపల్ కమిషనర్..**

మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే మున్సిపల్ కమిషనర్ విధులకు ఎప్పుడూ వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్తితి నెలకొన్నదని పలువురు ఆరోపిస్తున్నారు. బొల్లారం పట్టణంలో నీటి సర ఫరా, పారిశుధ్యం, అక్రమ కట్టడాలు తదితర సమస్యలపై ఏనాడు కమిషనర్ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**మానవత్వం చాటుకున్న ఆనంద్ రెడ్డి..**



బిల్డింగ్ శ్లాబ్ కూలి మృతి చెందిన, గాయపడిన క్షత గాత్రులను చికిత్స నిమిత్తం అర్ధరాత్రి వేళ తన కారులో తర లించి బొల్లారం బీజేపీ పార్టీ టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. గాయ పడిన బాధితులను బీజేపీ పార్టీ టౌన్ అధ్యక్షుడు కేజే ఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి మొదట మమతా మెడికల్ కాలేజీ తరలించగా అక్కడ వారు మల్లారెడ్డి హాస్పిటల్‌కి రిఫర్ చేశా రు. అక్కడ అంబులెన్స్ లేక పోవడంతో తన కారులో స్వ యంగా మల్లారెడ్డి హాస్పిటల్‌లో చేర్పించారు. హాస్పిటల్‌లో రాత్రి నుంచి అక్కడే ఉండి బాధితులకు బాసటగా నిలిచా రు. దాంతో బాదితులు కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉదయం 8 గంటలకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-కంది

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని.. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూ రు ఆదేశించారు. కంది మండల కేంద్రంలోని సహకార సం ఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని, పీఏసీఎస్ ఇంద్రకరణ్ సెంటర్లను గురువారం ఆమె పరి శీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతా వరణ మార్పులకనుగుణంగా ఉదయమే కొనుగోలు కేంద్రా లు ప్రారంభించాలన్నారు. అకాల వర్షాలు పడుతున్నందున కొనుగోళ్లు వేగవంతం చేయాలని.. ధాన్యాన్ని వెంటనే మిల ్లలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల తడిచిన ధాన్యాన్ని పరిశీలించి తడిసిన ధాన్యాన్ని రైతులకు రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని సెంటర్ ఇన్చార్జ్‌కి సూచించారు. గన్నీ బ్యాగ్‌ల సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కొండలరావు సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది

నవ తెలంగాణ-మిరుదొడ్డి



అకాల వర్షానికి వర్షాన్యం మొదలైంది ఇటీవల కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మిర్దొడ్డి మండలంలోని లింగుపల్లి మిరుదొడ్డి అల్వాల చెప్యాలా మల్లు పల్‌తో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షం రావడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. ఆరుకాలం కష్టపడి పండించిన పంట చేతికి అందిన సమయంలో వర్షం రావడంతో రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

## మల్లన్న హుండీ ఆదాయం రూ. 1.16 కోట్లు

46 రోజుల్లో రూ. 1,16 కోట్ల ఆదాయం


ఆలయంలో హుండీల లెక్కింపు

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈవో బాలాజీ శర్మ ఆధ్వర్యంలో హుండీలలోని కానుకలను లెక్కించారు. 46 రోజులలో మొత్తం రూ. 1,16,51,672 నగదు, 70 గ్రాముల బంగారు మిశ్రమం, 10 కిలోల వెండి మిశ్రమం, 18 విదేశీ కరెన్సీ నోట్లు, 23,క్వింటాళ్ల బియ్యం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు పరిశీలకులుగా రాగా, సేవా సమితి మహిళలు కానుకలను లెక్కించారు ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈఓ, బుద్ది శ్రీనివాస్, గంగా శ్రీనివాస్, ఏస్ఐ నాగరాజు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు .



## 5వ జల అవార్డుకోసం పాఠశాలను పరిశీలన



నవతెలంగాణ-మర్కుక్

5వ జాతీయ జల అవార్డు, 2023 సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్రం, మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమి కోన్నత పాఠశాల ఉత్తమ పాఠశాల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకుంది. గురువారం యుజిడి డీఈ వెంకటేశ్వర్లు, వైజ్ఞానిక శాస్త్రవేత్త డా.సుధీర్ కుమార్‌లు పరిశీలకులుగా అంగడికిష్టాపూర్ పాఠశాలకు చేరుకుని వర్షపు నీటి నిల్వ , కృత్రిమంగా భూగర్భ జలాల పెంపుదల వినూత్న పద్ధతులను అవలంబించడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని ప్రోత్సహించడం, నీటి పునర్వినియోగం , భూగర్భ జల వనరుల అభివృద్ధి, తగిన సామర్థ్యం స్థిరత్వంపై ప్రజలను భాగస్వామ్యం, ఎలా చేశారు, అవగాహన ఎలా కల్పించారనే, పలు విషయాలను పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఓంకార్ రాధ కృష్ణ, విద్యార్థులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నీటి నీల్వ, నీటి ఉపయోగం తయారు చేసిన డ్యాకుమెంటరి క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలలో నీరు వృధా కాకుండా చేపట్టిన కార్యక్రమాలు, సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈవో శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డిఆర్డీవో బాలకృష్ణ, ఎపీడీ సతీష్,డిపీఎం వాసుదేవ్,ఎంపీవో రాజలింగం,ఎంఈవో ఉదయ బాస్కర్ రెడ్డి,కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు శంకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుద్దెడ రాములు గౌడ్,పంచాయతీ కార్యదర్శి నీలిమా,ఉపాధ్యాక్షులు రామకృష్ణ రెడ్డి, వివిలు కృష్ణనవీన, టీపే స్వామి,సిసిలు కవిత, హరిచందు, నాగరాజు, అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి, సిఏ దివ్య, మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు, తదితరులున్నారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రెడ్డి
- నర్సాపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో

నవ తెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మరోసారి మోసం చేసిందని ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మెల్యే సునీత రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఎమ్మెల్యే సునీతరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా బస్టాండ్ రోడ్ మీదుగా తరలి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతుబంధు సక్రమంగా అమలు చేయకుండా ఎవరికి అందలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేయలేకపోగా రైతులు ధాన్యాన్ని రోడ్డుపైనే వేసి పడిగాపులు కాస్తున్నారు ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం లేదని అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరించి రైతులను మరోసారి మోసం చేసిందన్నారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పలు ఆందోళనల కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్ఎస్ నాయకులు సింగయపల్లి గోపి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భోగశేఖర్, శివం పేట అధ్యక్షులు రమణ గౌడ్, కౌడిపల్లి అధ్యక్షుడు సారా రామా గౌడ్, శివంపేట ఎంపీపీ హరికృష్ణ, నాయకులు పంబల బిక్షపతి, శ్రీధర్ రెడ్డి, బాబ్యానాయక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
శుక్రవారం 17 మే 2024 www.navatelangana.com



## వివాహ వలిమా వేడుకల్లో పాల్గొన్న తన్వీర్, నరోత్తం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన మహ్మద్ సలీమ్,మహ్మద్ అలీల సోదరుడి వివాహ వలిమా వేడుకల్లో టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తంలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు నాయకులు మాణిక్ ప్రభు గౌడ్, పర్వేజ్ పటేల్, వై.తరుణ్, గడ్డం జనార్ధన్, నబిసాబ్, బాల్‌రాజ్, కాశీనాథ్, చెంగల్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో జహీరాబాద్ వాసి దుర్మరణం

నవతెలంగాణ-జహీరాబాద్



(ఫైల్)

అమెరికాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో జహీరాబాద్‌కు చెందిన వ్యక్తి దుర్మరణం చెందాడు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన విద్యుత్‌శాఖలో పనిచేసి రిటైరైన వెంకటరమణ, మధురల కుమారుడు అబ్బరాజు పృథ్వీరాజ్ 8 ఏండ్ల క్రితం ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లాడు. అయితే అమెరికాలోని చార్లెట్‌లో భారతదేశ కాలమానం ప్రకారం గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పృథ్వీరాజ్ అక్కడికక్కడే దుర్మరణం పొందాడు. ఆయన మృతదేహం శని, ఆది వారాల్లో మన దేశానికి వచ్చే అవకాశం ఉన్నది. మృతుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజ్ కుమార్ దేశపాండే మేనల్లుడు కావడం గమనార్హం. కాగా మృతుడికి ఇటీవలే శ్రీప్రియతో వివాహం జరిగింది. మృతదేహం కోసం బాధ తప్త హృదాయాలతో కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. మృతదేహం స్వదేశానికి వచ్చిన అనంతరం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు మృతిని కుటుంబ సభ్యులు తెలిపారు.

## జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జోగిపేట



అల్లే శ్రీకాంత్



మధుసూదన్‌రెడ్డి



సంతోష్

2024-25 ఏడాదికి గాను జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ జోగిపేట పట్టణ అధ్యక్షులుగా అల్లే శ్రీకాంత్, సెక్రటరీగా జిఆర్. మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా గడ్డమీది సంతోష్, మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. రవీంద్ర గౌడ్ మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జోగిపేట పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరింప చేయాలని సభ్యులకు సూచించారు. క్లబ్బుకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, లయనిజాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## నేలకొరిగిన అరటి

నవతెలంగాణ-కోహిర్

మండల పరిధిలో గురువారం కురిసిన వర్షానికి పలు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. బిల్లాపూర్ గ్రామానికి చెందిన మున్నూరు రమేష్ కౌలుకు తీసుకుని రెండెకరాల్లో సాగు చేస్తున్న అరటి పంట పూర్తిగా నేల కొరిగింది. దాంతో తీవ్ర నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



## రేపటి నుంచి క్రైస్తవ జాతర ప్రారంభం

### అల్లీపూర్ గార్డెన్‌నగర్‌లో జాతరకు ఏర్పాట్లు

### మూడ్రోజుల పాటు ఉత్సవాలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలో నేటి(శుక్రవారం) నుంచి మెథడిస్ట్ 94వ క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర ప్రారంభమవుతుందని నిర్వాహకులు సారీన్ జాన్ గురువారం తెలిపారు. ప్రతీయేడు మెథడిస్ట్ చర్చి ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరగుతాయన్నారు. ఈ నెల 17న ప్రారంభమై 19వ తేదీ వరకు జాతర కొనసాగుతుందన్నారు. మొదటి రోజున జెండాల ఊరేగింపు ఉంటుందని, నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల క్రైస్తవ సోదరులు ఊరేగింపు పాల్గొనేందుకు పట్టణానికి చేరుకుంటారన్నారు. 18న దైవధ్యానం, మధ్యాహ్నం ఉచిత వైద్య శిబిరం, సాయంత్రం 4 గంటలకు ఆటల పోటీలు ప్రారంభం, 7 గంటలకు ఆరాధన, రాత్రి 8.30 గంటలకు భజన పోటీలు, బుర్రకథ, 11.30 గంటలకు ఏసు క్రీస్తు జీవిత చరిత్రకు సంబంధించిన చలన చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. 19న దైవ ఆరాధసందేశం, రోగులకు ప్రత్యేక ప్రార్ధనలు చేస్తారు. ఈ జాతరకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. కాబట్టి వారికి అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, హెచ్‌ఆర్సీ ప్రెసిడెంట్ డానియల్, సెక్రటరీ దయానంద్, హెచ్ ఆర్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొంటారన్నారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



## జిన్నారంలో వర్షం.. చల్లబడ్డ వాతావరణం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో వేడి వాతావరణం కాస్త చల్లబడింది. పంటలన్నీ కోతకొచ్చే సమయంలో అకస్మాత్తు వర్షం రావడంతో.. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొద్దిమంది రైతులు పంట కోత కార్యక్రమాల్లో తలమునకలు కాగా.. వర్షం కారణంగా ధాన్యం తడిస్తే చాలా నష్టపోతామంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం కూడా వర్షానికి తడుస్తున్నదని మరికొంతమంది వాపోతున్నారు. సెంటర్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు తూకం వేస్తే.. సెంటర్లలో రైతులకు ఇబ్బందులు ఉండబోవని చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. కండ్లముందే నీటి పాలు కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎంపీగా బి.బి పాటిల్ హ్యాట్రిక్ విజయం ఖాయం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ ఎంపీగా బి.బి పాటిల్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు దేశెట్టి పాటిల్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. మూడ్రోజుల క్రితం రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో జరిగిన ఎన్నికల్లో.. జహీరాబాద్ బీజేపీ అభ్యర్థిగా బిబి పాటిల్ ఘన విజయం సాధించడం పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికల పార్టీ అభ్యర్థి, పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి బి.బి పాటిల్ ద్వారానే సాధ్యమని.. రాష్ట్రంలో బీజేపీ 12 సీట్లు సాదించబోతుందని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బీజేపీ ద్వారానే సాధ్యమన్నారు

# యథేచ్ఛగా కలప వ్యాపారం

- ఇష్టానుసారంగా నరికేస్తున్న వ్యాపారులు
- పుల్కల్ నుంచి ప్రతీరోజు 10 నుంచి15 లారీల తరలింపు
- పట్టించుకోని అధికారులు



లారీలో కలప లోడ్..



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలో కలప వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. రైతులకు అతి తక్కువ ధర చెల్లించి.. వ్యాపారులు యథేచ్ఛగా చెట్లను నరికేస్తున్నారు. ప్రతీరోజు పెద్ద ఎత్తున చెట్లను నరికేస్తు.. పెద్ద మొత్తంలో దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణాన్ని పెంచాలని పదేపదే చెప్పినప్పటికీ దానికి విరుద్ధంగా దళారులు చెట్లను నరుకుతున్నారు. ఇంత జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

పుల్కల్ ఉమ్మడి మండలం నుంచి ప్రతీ రోజు 10, 15 లారీల కలపను తరలిస్తున్నారు. అధికారులు చూస్తుండగానే పెద్ద ఎత్తున కలప వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. దళారులు విలువైన అటవీ సంపదను భూస్థాపితం చేయడమే కాకుండా పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలే కలపను నరికేస్తుండగా.. ఓ విలేకరి అక్కడికి పోయి ప్రశ్నించినందుకు అతనిపై ఇష్టానిరీతిగా దళారులు మాట్లాడారు. తాము రైతుల వద్ద నుంచి చెట్లను కొనుగోలు చేశామని.. మీకేం సంబంధమంటూ దబాయించారు. ఈ విషయాన్ని సంబంధిత విలేకరి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు మాత్రం చేపట్టలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఇక్కడి వృక్ష సంపద మొత్తం నాశనం అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా వాతావరణ సమతుల్యం దెబ్బతిని.. వర్షాలు కూడా పడే పరిస్థితి ఉండదన్నారు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి.. ఈ కలప వ్యాపారాన్ని అడ్డుకోవాలని కోరుతున్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- పాఠశాలల ప్రారంభానికి అన్ని పనులు పూర్తి కావాలి
- నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడొద్దు
- ఎలక్ట్రిసిటి, టాయిలెట్స్ పనుల్లో బ్రాండెడ్ కంపెనీల పరికరాలనే వాడాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-పటాన్‌చెరు



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్, ఘనాపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వంట గదులు, అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడొద్దని సూచించారు. పనులను నాణ్యతతో చేయించుకోవాల్సిన బాధ్యత విద్యా శాఖ అధికారులదేన్నారు. పాఠశాలల్లో మంచి బ్రాండ్ ఉన్న కంపెనీల నాలుగు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు పెట్టాలని సూచించారు. మరుగుదొడ్లు, టాయిలెట్స్ లలో మంచి టైల్స్ ఏర్పాటు చేయాలని, రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మిషన్ భగీరథ ద్వారా పిల్లలకు మంచి త్రాగునీరు అందేలా చూడాలన్నారు. అన్ని పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించుకోవాలన్నారు. పాఠశాలల్లో ఉన్న టాయిలెట్స్ కు, పాఠశాలల్లో త్రాగునీటి సమస్య రాకుండా పాత వాటికి రిపేర్ చేయించాలని స్టీల్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని, పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. పాఠశాలల్లో పనులు చేపట్టకముందు, పనులు చేపట్టిన తర్వాత ఫోటోలను తీయాలని అధికారులను ఆదేశించారు. ఎత్తైన ప్రహరీ గోడలు ఎవరు దూకి రాకుండా, ప్రహరి గోడలపై కంచెలను అమర్చాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని, చదువుతో పాటు పిల్లలకు ఆటపాటలలో ప్రాధాన్యత ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రుద్రారం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో చేపట్టాల్సిన పనులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, పంచాయతీరాజ్ ఈఈ సురేష్, తహశీల్దార్ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

- సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ
- కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతరం సాయుధ బలగాల పహారా
- కౌంటింగ్ కేంద్రం వద్ద144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణం నడుమ సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరిచిన ఈవీఎం సెక్యూరిటీ లాక్ బుక్ రిజిస్టర్స్ లను, మూడు అంచెల సెక్యూరిటీ ఏర్పాటును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం పరిశీలించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోటుపాట్లకు తావులేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ సెక్యూరిటీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐడి కార్డు లేకుండా ఎవరిని అనుమతించవద్దని సిఆర్పిఎఫ్ సెక్యూరిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. గీతం యూనివ ర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ సీల్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, పంచాయతీరాజ్ ఈఈ సురేష్, తహశీల్దార్ రంగారావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం

- రైతులకు రూ.500 బోనస్ ఎప్పుడిస్తారు?
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్







కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతున్నదని.. ఎన్నికల ముందు రైతులకిచ్చిన రూ.500 బోనస్ హామీని ఇంకెప్పుడు నెరవేరుస్తారని బీఆర్ఎస్ శ్రేణులు గురువారం నిరసనలు చేపట్టారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపులో భాగంగా నారాయణఖేడ్ రాజీవ్ చౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు బోనస్ ఇస్తామని చెప్పిందన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలవుతున్నా.. హామీలను మాత్రం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలను కూడా అమలు చేయకుండా రైతులను, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని మండి పడ్డారు. వెంటనే రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు నరసింహారెడ్డి, విజయ రామరాజు, జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, ఎంపీపీలు మైపాలరెడ్డి, జంగం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, సంజీవ్ రావు పాటిల్, మాజీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సత్యపాల్ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మెన్ దిలీప్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బషీద్, పట్టణాధ్యక్షులు నగేష్ సెట్, సర్పంచులు, ఎంపీటీసీలు , గ్రామాధ్యక్షులు ఉపసర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేట :** జోగిపేటలో చేపట్టిన నిరసనలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని నాడు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింద న్నారు. అయితే ప్రస్తుతం కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదన్నారు. రైతాంగ హక్కులను హామీలను సాధించేందుకే బీఆర్ఎస్ నిరసన చేపట్టిందన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉం టుందన్నారు. ఈ నిరసనలో మాజీ ఏఎంసీ చైర్మెన్లు నాగ భూషణం, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, లింగ గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, సాయి కుమార్, వీరప్ప, విఠల్, విజయ్ కుమార్, శంకరయ్య, నర్సింలు, రమేష్, వినోద్ రెడ్డి, శంకర్, మొగులయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచనలతో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజు శ్రీ జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంజుశ్రీ జైపాల్ రెడ్డి, సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి.. ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి, దగా చేయడమే అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన బీ ఆర్ఎస్ పార్టీ వారి హక్కుల కోసం పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గౌడ్, మందుల వరలక్ష్మి, పాండు, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు, చక్రపాణి, విటల్, ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోనెల రఘు, ఇంద్రారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పుల్లారెడ్డి, రుక్కుద్దీన్, ప్రేమానందం, వర కుమార్, శ్రవణ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాపం.. పసి బాలుడు

**ట్రాక్టర్ చక్రాల కిందపడి మూడేళ్ల బాలుడు మృతి**
**డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబీకులు**
**అప్పాజీపల్లిలో చోటు చేసుకున్న ఘటన**

నవతెలంగాణ-కొల్చారం

ప్రమాదవశత్తు ట్రాక్టర్ చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన రమేష్, శివలక్ష్మి దంపతుల కుమారుడు జశ్వంత్ (3) వ్యవసాయ భూ పంచాయతీ కోసం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ మేరజ్ ఇంటికి కంటుంభంతో కలిసి వెళ్ళారు. అక్కడ భూమి పంచాయితీ జరుగుతుండగానే సయ్యద్ మేరజ్ కుమారుడు సయ్యద్ ఫాద్ పాషా అవసర నిమిత్తం కోసం నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను వెనకాలకు తీశాడు. అక్కడే ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడు జశ్వంత్ ప్రమాద వశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం మెదక్ హాస్పిటల్‌కు తరలిస్తున్న తరుణంలో పరిస్థితి విషమించి బాలుడు మార్గ మధ్యలో మరణించినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహ్మద్ గౌస్ ఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటింబికుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## ప్రగతి ధర్మారంలో పిడుగుపడి ఆవు మృతి

నవతెలంగాణ-రామాయంపేట

పిడుగుపాటుతో ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని ప్రగతి ధర్మారం గ్రామంలో జరిగింది. ఈదురు గాలులు ఉరుముల మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసిన సందర్భంలో గ్రామనికి చెందిన జెల్ల యాదగిరికి చెందిన ఆవు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మ హత్య

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి చెందిన గెరిగంటి ఎల్లయ్య వ్యవసాయ పెట్టుబడి కోసం తెలిసిన వారి వద్ద రూ. 4 లక్షల రూపాయలు అప్పుచేశారు. పంట సరిగా పండక పోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంటి ముందు గల వేప చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడని అతని భార్య అగు వరలక్ష్మి గురువారం పోలీస్‌లకు ఫిర్యాదు ఇవ్వగా నిజాంపేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది.

## నిజాంపేట మండలంలో వర్షం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని చల్మడ, నందిగామ, జడిచెరువు, రజాక్ పల్లి, బచ్చు రాజు పల్లి, గ్రామాలలో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. మేఘాలు పూర్తిగా మబ్బులు కమ్ముతూ వర్షం కురిసింది. అన్నదాతలు వడ్లను రోజు ఆరబెడుతూ కుప్పలుగా చేస్తూ నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. లారీలు సరిగా రాకపోవడంతో వడ్లు కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు, తెప్పలుగా పడి ఉన్నాయి. అకాల వర్షాలు రావడం వలన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే లారీలను ఎక్కువగా కేటాయించి కొనుగోలు సెంటర్లకు పంపే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పిడుగు పడి మూగజీవాలు మృతి

నవతెలంగాణ-పాపన్నపేట



పిడుగు పడడంతో మూగజీవాలు మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని అరేపల్లి లో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అరేపల్లీ గ్రామానికి చెందిన మస్కరి హన్మంతు వ్యవసాయంతో పాటు మూగ జీవాల పెంపకం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మేత కోసం తన జీవాలను తోలుకొని వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్ళగా మేత మేస్తున్న సమయంలో పిడుగు పడడంతో మేకలు మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. గ్రామస్తులు బాధితుని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**లక్షా 20 వేల ఆస్తి నష్టం**

నవతెలంగాణ-చిలిపిచెడ్



మండల పరిధిలోని గంగారం తాండకు చెందిన లంబాడి శీను ఎద్దు విద్యుత్ షాక్ తో మృతి చెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఎద్దు మేత కోసం విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లడంతో షాక్ గురైందని గ్రామస్తులు తెలిపారు. ఎద్దు మృతి చెందడంతో బాధితుడు లంబాడి శీను ఎద్దు రూ.120000 ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వ ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

## రామాయంపేట మోడల్ స్కూల్లో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ- రామాయంపేట

రామాయంపేట పట్టణం లోని తెలంగాణ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలని మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అమ్తుం జమాల్ అస్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో కోమటిపల్లి వద్ద ఉన్న మాడల్ స్కూల్లో ఉన్న ఇంటర్మీడియట్ కళాశాల మొదటి సంవత్సరానికి ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులను సేకరిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## రామాయంపేట మండల కేంద్రంలో భారీ వర్షం

నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేట మండల కేంద్రంలో అకాల వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి ఎండ వేడి విపరీతంగా ఉండగా రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం అరగంట సేపు పడడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు ఒకరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-రామాయంపేట

బైకు కారు ఢీకొన్న ఘటనలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండల పరిధిలోని కోనాపూర్ శివారులో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేట నుంచి రామయంపేట వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుడగ జంగాల శ్రీకాంత్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, పరిస్థితి విషమంగా ఉంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది.

## ఆరోగ్యమే మహాభాగ్యం

నవతెలంగాణ-నిజాంపేట



మన ఆరోగ్యాలను కాపాడు కుంటూ ఇతరుల ఆరోగ్యాలను కాపాడాలనే సదుద్దేశంతో ఐదు సంవత్సరాల నుండి వ్యాయామం, ఎక్సర్సైజ్, వాకింగ్ లాంటి దినచర్యలను ప్రారంభించడం జరిగిందనీ మండల కేంద్రానికి చెందిన యువకులు జీపి స్వామి తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మాట్లాడుతూ కరోనా సమయంలో వ్యాయామం వాకింగ్ లాంటి కార్యక్రమాలకు గ్రామ యువకులు కొంతకాలం పాటు బ్రేక్ చేయడం జరిగిందన్నారు. తర్వాత ఈ గ్రూపు కంటిన్యూ అవుతున్నప్పటికీ గతంలో లాగా అందరూ సభ్యులు హాజరు కాలేక పోతున్నారన్నారు. మళ్లీ మనమందరము కలిసికట్టుగా మన ఆరోగ్యాలను కాపాడుకుంటూ ఇతరుల ఆరోగ్యాలను కాపాడుకోవాలి అంటే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసుకుంటే మంచిది అని మన ఆరోగ్యమే మహాభాగ్యం గ్రూప్ సభ్యుల ఒక మంచి ఆలోచనకు రావడం జరిగిందన్నారు. మన చుట్టుపక్కల చిన్న చిన్న విలేజ్‌లలో కూడా ఓపెన్ జిమ్‌లు ఉన్నాయన్నారు. కావున మన మండల కేంద్రంలో ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేసుకుంటే మన గ్రామంలో ఒక ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పాటు చేయవచ్చు అనేది చాలామంది ఆలోచన, ఆరోగ్యమే మహాభాగ్యం గ్రూపు తరపున మేము కోరుకునేది ఏమనగా, కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా మనం అందరం తలా కొద్దిగా ఆర్థిక సాయం చేయడం ఇతరులతో చేయించడం వలన ఒక మంచి పని చేసిన వాళ్ళము అవుతామన్నారు. ప్రతి ఒక్కరి సహాయసహకారాలు ఉంటేనే ఈ ఆలోచన ఒక కార్యరూపం దాల్చుతుందన్నారు.

# వేతనాలు లేక అవస్థలు.

**పంచాయతీ కార్మికులకు అందని జీతాలు**

**నిస్సహాయ స్థితిలో అధికారులు.**

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్ 81

గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు 4 నెలలలుగా వేతనాలు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలలో 115 మంది పైగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో కార్మికుడికి రూ . 8500 కనీస వేతనం ఇస్తుంది. పెద్దశంకరంపేట్ మేజర్ గ్రామ పంచాయతీలో 50 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో జనాభా బట్టి చిన్న గ్రామ పంచాయతీలో ఇద్దరు, పెద్ద గ్రామ పంచాయతీలో నలుగురు చొప్పున కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతి రోజు పారిశుధ్య కార్మికులు ఉదయనే గ్రామాల్లో ఇంటింటా చెత్తను సేకరించడంతో పాటు మురికి కాలువలు శుభ్రవం చేసి చెత్తను ఎత్తిపోసే పనులు చేస్తున్నారు. ఇవే కాక పాఠశాలలు శుభ్రం చేయడం, డపింగ్ యార్డులో తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి వర్మి కంపోస్ట్ ఎరువులను తయారీ చేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు మాత్రం నెల నెలా రాకపోవడంతో అర్ధ ఆకలితో అలమటిస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ పరిదిలోని 3 నుండి 4 నెలలుగా జీతాలు అందడంలేదు. ప్రస్తుతం పంచాయతీల్లో రెండు ఏళ్లుగా ఎస్‌పిసి నిధులు 6 నెలలుగా 15 వ ఆర్థిక సంఘం నిధులు నిలిచి పోయాయి. దీంతో గ్రామపంచాయతీ నిధులు సకాలంలో రాకపోవడంతో సంబంధిత గ్రామ పంచాయతీలోని సిబ్బంది వేతనాలు అందడం లేదు. జనరల్ ఫండ్స్ కూడా లేకపోవడంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెలించడంలేదు. దీంతో అర్నెళ్ల నుంచి సిబ్బంది ఆర్థిక ఇబ్బందులో ఉంటూనే రోజు జీపిలో విధులు నిర్వహిస్తున్నారు.

### ఇబ్బందిగా ఉంది..

**రాములు. పెద్దశంకరంపేట్ గ్రామ పంచాయతీ**



కొన్ని నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదురకొంటున్నాము అధికారులకు అడిగితే జీపీ లో బడ్జెట్ లేదని చెబుతున్నారు. నేల నేల జీతాలు రాకపోతే మాకు పూట గండప్పేది ఎట్ల ప్రభుత్వం స్పందించి ప్రతి నెల జీతాలు అందిచలని కోరుతున్నారు.

### నిధులు రావడం లేదు

**ఎంపీడీఓ రాపికున్నిసా పెద్దశంకరంపేట్**



ప్రస్తుతం ఎస్ ఎఫ్ సి 15 వ ఆర్థిక సంఘం నుండి నిధులు రాకపోవడంతో జీపీలు నడపడం ఇబ్బందిగా మారింది. కొన్ని సందర్భలో జనరల్ ఫండు నుండి సిబ్బందికి వేతనాలు అందిస్తున్నాం గ్రామ పంచాయతీలో ఉన్న ఇబ్బందూలపై ఉన్నంతధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తాం.



### నాలుగు నెలలుగా వేతనాలు లేవు

**సంగని సాయిలు**



నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే మా కుటుంబ పోషణ ఎలాగో అధికారులు చెప్పాలి. పస్తులతో విధులకు హాజరు కావాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం మా పై దయాచుపి ఆకలితో అలమటిస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు నెలనేలా చెలించాలి.

### ఆందోళన చెపడతాం.

**సీఐటీయూ నాయకులు బి సంగమేశ్వర్ పెద్దశంకరంపేట్.**



కార్మికుల వేతనాలు వెంటనే చెలించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం. జీపిలకు నిధుల విడుదలలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావడం లేదు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే కార్మికులు విధులు ఎలా నిర్వహిస్తారో చెప్పాలి.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- కాంగ్రెస్ రైతు వ్యతిరేఖ విధానాలను ఖండిస్తున్నాం
- అన్నదాతలను గోస పెడితే ఆందోళనలు చేస్తాం
- రైతుల పక్షాన బీఆర్ఎస్ అండగా నిలుస్తుంది
- మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్
- అదనపు కలెక్టర్ రమేష్ కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ - మెదక్

అకాల వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మాజీ రైతు బంధు అధ్యక్షులు సోములు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మదేవేందర్ రెడ్డి సూచన మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ రమేష్ కు రైతుల పక్షాన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయానికి కరెంటు, నీళ్లు ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పండించిన వడ్లను కొనకుండా గోస పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యం వానకు తడుస్తుంటే పట్టించుకోని సర్కారు తీరు చూసి గుండె మండిన అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారని తెలియారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు బోనస్ అంటూ ప్రకటించడం పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మర్నాడు క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటమార్చి రైతంగాన్ని మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు రకం వడ్లను పండిస్తారని, ఈ విషయం తెలిసినా సన్న వడ్లకే బోనస్ ఇస్తామని ఎలా ప్రకటించారని నిలదీశారు. ఓట్లు డబ్బాలో పడంగానే కాంగ్రెస్ పార్టీకి రైతుల అవసరం తీరిందన్నారు. అందుకే నాలిక మడ్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పంచుకుందని విమర్శించారు. సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవారన్నారు. ప్రజలు ఇప్పటికే ఆగ్రహంతోనే ఉన్నారని, రైతులకు రైతుబంధు, రైతు భరోసా ఇవ్వకుండా రైతన్న అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. రైతంగా హక్కులను హామీలను సాధించేందుకు బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతుందన్నారు. తెలంగాణ ప్రజలు, రైతులు వద్దురా నాయన కాంగ్రెస్ పాలన అని, సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తున్నారని తెలిపారు. అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, పాపన్నపేట మండలం వైస్ ఎంపీపీ పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, పాపన్నపేట మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు జగన్, నాయకులు బాలరాజు, కిషన్, రమేష్, రైతులు రామయ్య, పవన్, నరసింహారెడ్డి, యాదగిరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు........

## లారీల కొరత లేకుండా చూస్తాం

**15 రోజుల్లో చివరి గింజవరకు కొనుగోలు చేస్తాం**
**అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు**



నవతెలంగాణ-చిలిపిచెడ్

15 రోజుల్లో చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఎవరు అధైర్యపడవద్దని, లారీల కొరత లేకుండా చూస్తామని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చిలిపిచేడ్ మండలంలోని చిట్కుల్‌లో సోమక్కపేట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చిలపిచెడ్ మండలానికి చెందిన కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యమును సిద్దిపేటకు అలాట్ చేశామని, మండలానికి 10 లారీలు వచ్చే విధంగా చూస్తామని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని లోడింగ్ అన్ లోడింగ్ గురించి ఆయన తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్ వెంట సోమక్కపేట్ సొసైటీ సీఈవో పోచయ్య, సోమక్కపేట్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామ శివారులో ముత్తగారి బాల్ నర్స్ గౌడ్ తాను నడుపుతున్న దాబాలో ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాపు నడుపుతున్నాడని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్, సిద్దిపేట రూరల్ పోలీసులు కలసి రైడ్ చేశారు. 10 లీటర్ బీరు బాటిల్లు, విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ ఇండ్లలో, హొటల్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో, ఇతర దుకాణాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడిపితే, బహిరంగ ప్రదేశంలో కానీ ఇళ్లల్లో గానీ పేకాట ఆడితే సమాచారం అందించాలని కోరారు. జూదం పేకాట ఆడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన మరియు పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు.

## గీత కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్**

నవతెలంగాణ-చేర్యాల

ఇటీవల ప్రమాదవశత్తు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలైన మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు బొందుగుల చంద్ర శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. చేర్యాల మండల కేంద్రంలో గురువారం అరుణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ వీరన్నపేట గ్రామానికి చెందిన బొందుగుల చంద్ర శేఖర్ ఆదివారం తన రోజు వారీ కల్లు గీత వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతూ ప్రమాదవశాత్తు మోకు జారీ కింద పడడంతో వెన్నుపూసతోపాటు కుడి చెయ్యి విరిగి శరీరం మొత్తం తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. స్థానికులు వెంటనే చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు సిద్ధిపేటకు తరలించారన్నారు. గీత వృత్తి తప్ప ఎలాంటి ఆధారం లేని నిరుపేద కల్లు గీత కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకొని తక్షణమే బాధితునికి ఎక్స్ గ్రేషియో అందించి భవిష్యత్తు లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కల్లు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నేడు మండలంలో విద్యుత్ సరఫరా పిలిపివేత

నవతెలంగాణ- కొల్చారం

మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి హమ్మద్ అలీ పేర్కొన్నారు. 132/33 కేవి కొడిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

## పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

**బి.శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ గజ్వేల్.**

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని గజ్వేల్ సబ్ జూనియర్ ఆఫీసర్ బి శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా గురువారం డిస్ట్రిక్ట్ హాస్పిటల్ మాత శిశు సంరక్షణ కేంద్రం గజ్వేల్ నందు డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలు దరిచేరవన్నారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన ఇంటి పరిసరాలు కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. ఒక చిన్న దోమ -ఒక పెద్ద పెను ప్రమాదంగా మారుతుందని, అనేక రకాలైన వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూచికెన్ గునియా, లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇంట్లో పనికిరాని వస్తువులను మన ఇంటి పరిసరాలలో నీటి నిల్వ కుళాయిలను కొబ్బరిచిప్పలను తొట్టిలను ఎయిర్ కూలర్లోని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అందరితో దేవసాని వాసుదేవ్ పరిశుభ్రతను పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బి.రాము ల్యాబ్ టెక్నీషియన్, శశి ఫార్మసిస్ట్, దుర్గా బాయ్ లక్ష్మి , జ్యోతినర్సింగ్ ఆఫీసర్లు రేణుక,నాగమణి, కల్పనా,జ్యోతి,రేష్మ, ఆశ వర్కర్లు, పారామెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ - నార్సింగి

మండల పరిధి గ్రామమైన శంకాపూర్‌కు చెందిన ముత్తుల బాబు గత నాలుగు సంవత్సరాల క్రితం గ్రామ పంచాయితీ కార్మికుడిగా పని చేస్తుండగా అతనికి పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి అతనికి ఇంటి వద్దనే చికిత్స అందించారు. గురువారం అనారోగ్య సమస్యల వల్ల అతను మృతి చెందారు. మృతుడు ముత్తుల బాబుకు భార్య సంగీత, పిల్లలు జెస్సీ, రాబిన్ లు ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కు కోల్పోవడంతో చలించిన గ్రామ తాజా మాజీ సర్పంచ్ రాయిలాపురం సుజాత శ్రీనివాస్ ఐదు వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సుజాతా శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా ఒక పేద కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడం తనకు బాధ కలిగించిందని, తనకు తోచిన ఆర్థిక సహాయం అందించానని అన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

## కరాటే బ్లాక్ బెల్ట్‌లో మెదక్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మెదక్

కరాటే బ్లాక్ బెల్ట్‌లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షకు చీఫ్ ఎగ్జామినర్‌గా రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యవస్థాపకులు సీనియర్ కరాటే మాస్టర్ నగేష్, అబ్జర్వర్స్‌గా మాస్టర్లు అశోక్, నవీన్ వ్యవహరించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ పరీక్షలో పాల్గొన్నారు. ఇందులో విశిష్ట రాజ్, ఇందు, శ్రీ హర్షిత, విధాత్రి, అక్షర, మణి వర్ధన్, శ్రీరాజ్ రెడ్డి, స్వరూప్, దుర్గా ఉత్తీర్ణత సాధించడం జరిగింది. మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో కరాటే మాస్టర్లు నగేష్, దినకర్ ల పర్యవేక్షణలో గత ఐదేళ్లుగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు శిక్షణ పొందడం జరిగింది. ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు బెల్ట్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రెంజుకి షాటోకన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యవస్థాపకులు సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ మాట్లాడుతూ. నేటి సమాజంలో అమ్మాయిలకు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. అదేవిధంగా యూనివర్సిటీ, ఆసియ, ఓలంపిక్ లోనూ కరాటే ఉన్నదని గుర్తుచేశారు. కరాటే నేర్చుకోవడం వలన విద్యార్థులు శారీరకంగా మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, మల్లేశం, ప్రసన్న, ఐశ్వర్య, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


**మెదక్ డిప్యూటీ రేంజ్ అధికారి గీత**




నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మెదక్ డిప్యూటీ రేంజ్ అధికారి గీతా అన్నారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాయిపల్లి, బ్యాతోల్, గాజిరెడ్డిపల్లి, బూరుగుపల్లి, లింగసాన్ పల్లి గ్రామాలలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గీత ఆధ్వర్యంలో ఫారెస్ట్ భూములలో అక్రమ సాగు పలు ప్రాంత రైతులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, ఇతర వ్యక్తులు అటవీ భూములలో చెట్లు నరకడం, ఫారెస్ట్ భూములను అక్రమంగా సాగు చేయడం లాంటివి చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవి జంతువులను వేటాడిన వన్య మృగాలను అక్రమంగా రవాణా చేసిన చట్టపరమైన కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే రైతులకు వర్షాకాలం మొదలు కావడంతో అటవీ భూములు చదను చేయడం కోసం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు కిష్టయ్య, ధనలక్ష్మి, రమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకట్రామిరెడ్డి విజయం ఖాయం



నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంటులో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించనున్నట్లు ఎంపిటీసిల ఫోరం మండలాధ్యక్షులు రాజబోయిన కృష్ణ యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని దామరకుంటలో మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెర నరేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్యతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ మెదక్‌లో ఎగిరేది బీఆర్ఎస్ జెండానేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంటు, నీటి కష్టాలు మొదలయ్యాన్నారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు కైవసం చేసుకుంటారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని. బీఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమయినందున ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
శుక్రవారం | 17 మే 2024 | www.navatelangana.com

## రైతులపై బీఆర్ఎస్ పార్టీ మొసలి కన్నీరు



నవతెలంగాణ-గజ్వేల్

రైతులపై భారత రాష్ట్ర సమితి పార్టీ మొసలి కన్నీరు కారుస్తుందని కాంగ్రెస్ యువజన గజ్వేల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె కృపానందం అన్నారు. గురువారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ 10 సంవత్సరాలలో రైతులను ఆదుకొని బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ధర్నాలు చేయించడమేమిటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు బేడీలు వేసి అరెస్టు చేసిన సంఘటనలు ఉన్నాయని అవి ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమాన్ని బీఆర్ఎస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. ఎన్నికల కోడ్ ఉండటం వల్ల పంట కొనుగోలు జాతిని ఏర్పడుతుందని ప్రభుత్వమే ప్రకటించిందని దీని ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాస్తారోకోకు దిగినట్లు ఆయన అన్నారు.

## డీడబ్ల్యూఓను కలిసిన టీఎన్జీవో యూనియన్ అంగన్వాడీలు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట జిల్లా నూతనంగా ఎన్నికైన మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి (డీడబ్ల్యూఓ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన శారదను గురువారం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో సిద్దిపేట జిల్లా టిఎన్జీవో యూనియన్ అంగన్వాడీ టీచర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. అంగన్వాడి సెంటర్ల పరిధిలో ఉన్న సమస్యలు వారికి తెలిపామన్నారు. సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప,జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, ఈసీ మెంబర్ తోట పద్మ చేర్యాల ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, సరోజిని, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా గెలిపించాలి



నవతెలంగాణ-చేర్యాల

వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని జనగామ పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జి అఖిల్ పాషా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేర్యాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి అధ్యక్షతన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్లు ముస్త్యాల యాదగిరి, తుమ్మలపల్లి సంజీవులు,ఆడెపు నరేందర్,ఆది శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్, మంజే మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎంపీపీ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన జిందం మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మద్దూరు ఎంపీపీ బద్దిపడిగ కృష్ణా రెడ్డి పరామర్శించి. రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యువకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో గందె మహాలక్ష్మి సంతోష్ కుమార్ ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో శ్రీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేసినట్లు క్లబ్ అధ్యక్షురాలు వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు వీరేశం, హర్షిత, కూర అంతయ్య, పాల్గొన్నారు.

## మెదక్ లో కాంగ్రెస్ విజయం ఖాయం



నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ అన్నారు. గురువారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ సుస్థిర పరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పట్టం కట్టారన్నారు. పార్లమెంటు ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అత్యధిక స్థానాలలో గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీ సరస్వతీ విద్యా మందిర్ స్కూల్‌కు విరాళాలు



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన కొల్లూరి శ్యామ్ ప్రసాద్ కుమారుడు చిరంజీవి గౌతమ్ క్రిష్ణ జన్మదినం సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు రు.10 వేల విరాళాలం అందజేశారని డాక్టర్ ఆకుల నరేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు డా. ఆకుల నరేశ్ బాబు మాట్లాడుతూ మన దేశం ధార్మిక చింతనకు, సేవా నిరతికి నిలయమన్నారు.ఎందరో త్యాగధనులకు పుట్టినిల్లనీ, శ్యామ్ ప్రసాద్ అదే కోవకు చెందిన వ్యక్తి అన్నారు. ఆపన్నహస్తం సేవా సంస్థ ద్వారా ఆయన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. వారి కుమారుని జన్మదినం సందర్భంగా వారు పాఠశాలకు విరాళాలు అందజేయడం అభినంధనీయమని తెలిపారు. ఈ సందర్భంగా చి.గౌతమ్ క్రిష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన జీవితంలో ఉత్తమ వ్యక్తిగా ఎదిగి,వంద సంవత్సరాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్. ఐ. సి. గజ్వేల్ బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, ఎల్.ఐ.సి.డెవలప్ మెంట్ ఆఫీసర్ రమేశ్, రంగాచారి, శ్రీ లక్ష్మీ ప్రసన్న, కుమారస్వామి, సాయిబాబు, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

- అవగాహనతోనే వ్యాధులు అంతంసీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- సిద్దిపేట డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ-నంగునూరు

డెంగ్యూ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా వైద్యా ఆరోగ్య శాఖ పని చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగ్యూ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కీటకజనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అవగాహనతోనే వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రణాళిక బద్ధంగా వైద్య సేవలు అందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బంది ఎప్పటికపుడు విజిట్స్ చేయాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను ప్రజలకు వివరిస్తూ ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ కేవలం మంచినీటి నిల్వలో వృద్ధి చెందుతున్న విషయం చెప్పాలన్నారు. కొబ్బరి చిప్పలు, కూలర్స్, ఇంటిలో నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించేలా చూడాలన్నారు. సమాజంలో ఇప్పుడు మార్పు అవసరం ఉందని తెలిపారు. మన చుట్టుపక్కల శుభ్రత పాటిస్తూ పక్క వాళ్ళు పాటించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కీటక జనిత సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డెంగ్యూ అవగాహన ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయరాణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రజని, డాక్టర్ శ్రీకాంత్, పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ నాయక్, గట్ల మల్యాల వైద్యాధికారి పీహెచ్ సి డాక్టర్ అంజలి రెడ్డి, డిఎంహెచ్ ఓ సీసీ డానియల్, డెమో నవీన్, రాజ్ కుమార్, ఎన్ విబిడిసిపి హెచ్ఇఓ గాలి రమేశ్, పిహెచ్ సి హెచ్ఇఓ స్వామి, కొండయ్య, సిహెచ్ఓలు ఫైలేరియా, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో ప్రజలు లేరు

నవతెలంగాణ -నంగునూరు

కాంగ్రెస్ ప్రభుత్వం చేసే సంక్షేమ పథకాలు చూసి జీర్ణించుకోలేక బీఆర్ఎస్ ను ప్రజలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని కాంగ్రెస్ నాయకులు ఎం.డి.ఇమ్రాన్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విభజన తరువాత సెంటిమెంట్ తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలకు హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. కల్లబొల్లి మాటలు చెబుతూ అధికారం అనుభవించి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనారని గుర్తు చేశారు.కాంగ్రెసు పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారని తెలియజేశారు.ఎన్నికల్లో ప్రజలు చీకొట్టిన బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని చెప్పారు. నిరసనల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తున్న బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి పూర్తిస్థాయిలో ఒక్కటికూడా అమలుకు నోచుకోని అసమర్థ బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందని తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలవాలని ఆశయంతో ఆగస్టు15 కల్లా రైతు రుణమాఫీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు.ఆరునూరైనా రైతు రుణమాఫీ జరిగి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెండింగులో కోట మైసమ్మ రోడ్డు

- ఇబ్బందుల్లో ప్రజలు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఇందిరాపార్క్ కోట మైసమ్మ రోడ్డు పెండింగ్‌లో ఉండటం వల్ల స్థానిక ప్రజలకు నివాస గృహాలకు తలకు మించిన భారంగా మారింది. స్థానిక ఢిల్లీ వాలా హెూటల్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రోడ్డు పూర్తి చేసి ఎంపీడీవో కార్యాలయం నుంచి కోర్టు కేసుల పేరిట ఆర్ అండ్ బి అధికారులు రోడ్డును వేయకుండానే వదిలేశారు. మురికి కాల్వలు నిర్మించలేకపోయారు. మురికి కాలువలో మురికి నీరు పేరుకుపోయి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలుస్తుంది. దీంతో సమీప నివాస గృహాలకు జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అక్కడి ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. . అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావులు గజ్వేల్ పట్టణ రోడ్ల విస్తరణ విషయంలో పట్టించుకోలేకపోయారు. రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు గత ప్రభుత్వం ఆదుకోలేకపోయింది. సుమారు 160 మంది బాధితులు ఉండగా 35 మంది వరకు డబుల్ బెడ్ రూమ్‌లో అవకాశం ఇచ్చారు. వారికి కూడా సరైన పట్టాలు అందించలేకపోయారు. అప్పటి ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న నాయకులు గజ్వేల్ అభివృద్ధి ముఖ్యంగా రోడ్ల విస్తరణ విషయంలో దృష్టి పెట్టలేదు. కాంట్రాక్టర్, అధికారులు కలిసి ఇందిరాపార్కు, కోట మైసమ్మ రోడ్డు విస్తరణ చేశారు. ఇండ్ల తొలగింపు వరకు మాత్రమే పట్టింపు చేసుకుంది. ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరగాలని ప్రతిపక్షం సైతం ధర్నాలు రాస్తారోకోలు చేశారు. ఇందులో సీపీఐ(ఎంల్మ) పార్టీ ముందుండి రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయిన నిర్లక్ష్యం చేశారని విమర్శలు ఉన్నాయి. ఇండ్ల తొలగింపులో బాధితులకు ఇల్లు కేటాయించి రోడ్డు పూర్తి చేయాలని అనేకసార్లు స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి ఆ ఏరియా ప్రజలు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. గతంలో గజ్వేల్ ఇంచార్జిగా పనిచేసిన మంత్రి హరీష్ రావు ఒక్కసారి కూడా రోడ్డు పనులను పరిశీలించలేకపోయారు. హరీష్‌రావు పరిశీలిస్తే రోడ్డు దుస్థితి ఇలా ఉండేది కాదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి గత ప్రభుత్వం ఇండ్లు కేటాయిస్తే రోడ్డు విస్తరణ పూర్తయ్యేదని ఇండ్లు కోల్పోతున్న వారు చెప్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తే మురికి కాలువల నిర్మాణానికి సహకరిస్తామని బాధితులు చెప్తున్నారు. ఇండ్లు కోల్పోతున్నవారు మురికి కాల్వ నిర్మాణంకు సహకరిస్తే రోడ్డు పనులు పూర్తి చేస్తామని సంబంధిత శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.

**సంబంధించిన శాఖాధికారులతో చర్చిస్తా**

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంద్ర పార్క్, కోట మైసమ్మ రోడ్డు విస్తరణ విషయంలో సంబంధిత శాఖ అధికారులతో చర్చించి ముందుకు వెళ్తాం. ప్రజల ఇబ్బందులను గుర్తిస్తాం. పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద మురికి నీరు నిల్వడంతో ప్రజలకు ఇబ్బందులు ఉన్నట్టు తన దృష్టికి వచ్చింది. ఇండ్లు కోల్పోయిన వారితో కూడా చర్చిస్తాం. పరిష్కారానికి కృషి చేస్తా.

# అబద్ధాల రేవంత్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ పార్టీ నాయకుల రాస్తారోకో
- దొడ్డు ధాన్యానికి రూ 500. బోనస్ ఇవ్వాలని రాస్తారోకో



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. దొడ్డు వరి ధాన్యం కు. రూ 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ముందు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలతో కాలం వెల్లదిస్తుందని ఆయన పేర్కొన్నారు. సన్నగింజలకు బోనస్ ఇస్తున్న ప్రభుత్వం దొడ్డు రకానికి ఎందుకు ఇవ్వదని ఆయన ప్రశ్నించారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు. కెసిఆర్ నాయకత్వంలో పది సంవత్సరాలు తెలంగాణ రైతులను అన్ని విధాల ఆదుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. కెసిఆర్, హరీశ్ రావు నాయకత్వంలో గజ్వేల్ ప్రాంత రైతులను అన్ని విధాల ఆదుకున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఇప్పటివరకు పెన్షన్ స్కీమ్ పెంచలేదన్నారు. మహిళలకు రూ 2500. ఇవ్వలేదన్నారు. తులం బంగారం, కళ్యాణ్ లక్ష్మి, చిన్నపిల్లల కెసిఆర్ కిట్ ఇతర స్కీములు అమలు చేయడం లేదని, దీంతో పేదలు ఎన్నో ఇబ్బందులు గురవుతున్న సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు సాగు పండిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి సకాలంలో గిట్టుబాటు ధర అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి నాయకులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జాకీర్, మాజీ వైస్ చైర్మన్ దుంబాల అరుణ, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ రజిత, చందన రవీందర్, బొగ్గుల చందు, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మరికంటి వరలక్ష్మి కనకయ్య, ఎంపీటీసీ జ్యోతి స్వామి, సింగిల్ విండో చైర్మన్ వెంకట్ గౌడ్, వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, భూపాల్ రెడ్డి, బాలచంద్రం, మల్లయ్య రామ్ రెడ్డి, ఎల్లయ్య , స్వామి చారి, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

# హరిత వనంగా కనిపిస్తున్న మార్కెట్

- రైతులకు సకల సౌకర్యాలు.
- రైతులకు గిడ్డంగులు, ధాన్యం ఆరబెట్టుకున్నందుకు ప్రత్యేక షెడ్లు







నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ఎక్కడ చూసినా ఆకుపచ్చగా హరితహారంగా కనిపిస్తుంది. దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు వేపుగా పెరిగి హరిత వనంగా దర్శనమిస్తున్నాయి. రైతు సంక్షేమమే లక్ష్యమంటూ గత ప్రభుత్వం అదే తరహాలో రైతులకు న్యాయం చేసేలా కృషి చేసింది. రైతులు పత్తి మొక్కజొన్న, ఇతర పంటలను వ్యవసాయ మార్కెట్లల్లో అమ్ముకునేందకు వీలుగా సదుపాయాలు కల్పించి, మద్దతు ధరను సైతం కల్పిస్తున్నది. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ అద్భుతంగా అభివృద్ధి జరిగింది. రూ. 6 కోట్లతో స్వాగత తోరణం అద్భుత టెక్నాలజీతో ఇన్ టెక్నాల జీతో భారీ షెడ్ల నిర్మాణం, సీసీరోడ్లు, రైతుల కోసం విశ్రాంతి భవనం, భోజనశాల, రైతు, కాడెడ్ల ప్రతిమలను ఏర్పాటు చేశారు. హరేరామ హరేకృష్ణ వారి ససహకారంతో తాగునీటి వసతితో పాటు రూ.5 భోజనం సదుపాయాలు కల్పించారు. ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో హరిత విప్లవానికి నాంది పలికింది. ఆకుపచ్చ వాతావరణం కన్పిస్తున్నది. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌ను 2014 తర్వాత అభివృద్ధి చేసుకోవడదంతో రైతులకు సకల సదుపాయాలు అందుబాటులోకి వచ్చింది.

**రాజీవ్ రహదారిపై కూరగాయల మార్కెట్**

రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు మహిళా రైతులు రాజీవ్ రహదారి పక్కన కర్రల సాయంతో చేసుకున్న గుడిసెల పక్కనే కుర్చొని అమ్ముకునేవారు. 2014కు ముందు రోజూ అదేమార్గం తన నియోజక వర్గానికి వెళ్లే మార్గంలో అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు చూసి సకల ఏర్పాట్లు చేశారు. గడిచిన తెలంగాణ ప్రభుత్వంలో గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ సమీపంలోని పాతూర్ చౌరస్తా వద్ద రూ.కోటి వెచ్చించి కూరగాయల వ్యాపారుల కోసం భారీ షెడ్ నిర్మాణం చేయించారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ సమయంలోని పాతూర్ చౌరస్తా వద్ద నిత్యం పాతూర్ గ్రామానికి చెందిన మహిళా రైతులు వ్యవసాయ పొలాల్లో పండించిన తాజా కూరగాయలకు అమ్ముతారు. మహిళా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. కూరగాయలు అమ్ముకునేందుకు భారీ షెడ్, మొక్కజొన్న కంకులు అమ్ముకునే వారికి ప్రత్యేకంగా మరో షెడ్యూల్ వాహనదారులకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేశారు. మార్కెట్లో సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా షెడ్లు ఆకర్షణీయంగా నిలిచాయి. కోటి రూపాయలతో సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ పాతూరు వద్ద ఆహ్లాదకర వాతావరణం గత ప్రభుత్వ సహకారంతో మార్కెట్ అభివృద్ధి చెందింది. సీసీ రోడ్లు, విశ్రాంతి భవనం, పాతూర్ వద్ద కూరగాయల మార్కెట్ పనులు పూర్తి చేశారు. రైతులు పండించిన ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాంలు నిర్మించారు.

# దళిత రైతుపై ధాన్యం కొనుగోలు నిర్వాహకుడు తిట్ల దండకం

- అధికారుల ముందే రైతులను నానా బూతులు తిట్టిన నిర్వాకుడు



చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదరు రైతులు ప్రభుత్వాన్ని కోరారు

నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి. గత 20 రోజుల క్రితం రైతు ధాన్యాన్ని తీసుకువచ్చి కాంట పెట్టమని కోరడంతో దళిత రైతుపై ఐకెపి ధాన్యం కొనుగోలు నిర్వాహకుడు అనుముల వెంకట కృష్ణారెడ్డి, సి సి మహేందర్ ముందే నానా బూతులు తిడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన చేర్యాల మండలంలోని అర్జున పట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు సింగపాక పోశయ్య, అనుముల నర్సారెడ్డిలు మాట్లాడుతూ గత నెల 30వ తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తాము పండించిన పంటను తీసుకువచ్చి. వడ్లను ఆరబెట్టినట్లు వారు తెలిపారు. తేమ వచ్చిన బార్దన్ ఇవ్వమని నిర్వాహకుని కోరినా ఇవ్వకపోగా తమను ఇబ్బంది పెట్టినట్లు వారు తెలిపారు. తమకంటే వెనకాల వచ్చిన వారి వడ్లను కాంట వేస్తుండడంతో ఇదేంటని నిర్వాకుడు వెంకటకృష్ణారెడ్డిని నిలదీయడంతో తమపై నానా బూతులు తిడుతూ, తమపై దాడి చేసేందుకు వచ్చినట్లు వారు తెలిపారు. అక్కడే ఉన్న ఐకేపీ మహేందర్ ముందే ఐకేపీ ధాన్యం కొనుగోలు నిర్వాహకుడు తమను నానా బూతులు తిడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు వారు తెలిపారు . తమ ధాన్యాన్ని కాంట పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులతో పాటు తమను అకారణంగా దూషించిన వ్యక్తిపై

## వరి ధాన్యం సేకరణలో ఇబ్బంది లేకుండ చూడాలి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

గురువారం రోజు సమీకృత జిల్లా కార్యాలయంలో కలెక్టర్ యం. మను చౌదరి వానాకాలం 2023-24 సిఎంఆర్ డెలివరీలు, యాసంగి 2023-24 సంబంధించిన వరిధాన్యం కొనుగోళ్ళ విషయంలో రైస్ మిల్లర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం 2023-24లో సిఎంఆర్ పెండింగ్ ఉన్న రైస్ మిల్లర్లు అందరూ ప్రతి రోజూ తమ మిల్లింగ్ కెపాసిటీ అనుగుణంగా సిఎంఆర్ డెలివరీ చేయాలని ఏ ఒక్క మిల్లరూ సిఎంఆర్ డెలివరీలో జాప్యం చేయరాదని తెలిపారు. సిఎంఆర్ డెలివరీలు వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అధిక సిఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల నుంచి వేగంగా డెలివరీ చేసే మిల్లర్లకు తమ స్వంత ఖర్చులతో ధాన్యం ట్రాన్సుర్ చేసి సిఎంఆర్ టైం ప్రకారం పూర్తి చేసేలా పౌర సరఫరాలు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యాసంగి 2023-24కి సంబంధించిన వరిధాన్యం సేకరణ ప్రక్రియను, రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పూర్తి పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. రైస్ మిల్లర్స్ అధ్యక్షులు కే.చంద్రశేఖర్ మాట్లాడుతూ వచ్చే వారం రోజుల్లో కాజీపేట చెర్లపల్లి యఫ్.సి.ఐ. గోదాముల్లో స్థలాభావం ఏర్పడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ జనరల్ మేనేజరు యఫ్.సి.ఐ. వారితో మాట్లాడి సమస్యని పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. శ్రీనివాస్ రెడ్డి, డి.సి.యస్.ఒ తనుజ, డి. యం (సి.యస్.సి) హరీష్ మరియు మిల్లర్ల ప్రతినిధులు, మిల్లర్లు పాల్గొన్నారు.

## రైతుల పట్ల సీఎం రేవంతర్ రెడ్డిది కపట ప్రేమ

- బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

రైతు ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల కపట ప్రేమ నటిస్తున్నారని తేటతెల్లమైందని బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ శర్మ, నాగిరెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సోమిరెడ్డిలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి నష్టం కలిగించినా, ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోయినా రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు గురువారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లు అనే తేడా లేకుండా క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంతో పాటు, దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోరాటం చేస్తేనే కాలేశ్వరం నుంచి రైతులకు నీళ్లువదిలారని గుర్తు చేశారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పార్టీ రైతుల వెంటే ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండం సంపత్ రెడ్డి, పయ్యావుల ఎల్లం, సుందర్, చందర్‌రావు, మాణిక్యరెడ్డి, ముత్యం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## డిడబ్ల్యుఓను కలిసిన టీఎన్జీవో యూనియన్ అంగన్వాడీలు



నవతెలంగాణ-సిద్దిపేట

నూతనంగా నియామకమైన జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టిన శారదను జిల్లా కార్యాలయంలో జిల్లా టిఎన్జీవో యూనియన్ అంగన్వాడీ టీచర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ శారదకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. అంగన్వాడి సెంటర్ల పరిధిలో ఉన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకుపోగా, సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, ఈసీ మెంబర్ పద్మ, చేర్యాల ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, సరోజిని, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటు తీన్మార్ మల్లన్నకు వేయాలి

- జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

ఖమ్మం, నల్లగొండ, వరంగల్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి కోరారు. దూల్మిట్ట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఖమ్మం, నల్లగొండ, వరంగల్, పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థిని పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ అఖిల్ పాషా, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్లు గుడ్డం భద్ర, పొల్త్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సందిటి లక్ష్మి బూర గంగాధర్, జిల్లా నాయకులు నారోజు శ్రీనివాస్, గద్దల మహేందర్, జగన్, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తరపున ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

మండలంలోని పాలమాకుల గ్రామంలో పుల్లూరు స్వాతి (సుండు రేణుక) అనారోగ్యంతో భాద పడుతూ గురువారం మృతి చెందారు. నిరుపేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రంగు అశోక్ గౌడ్ పార్టీ తరపున రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దండవేణి రాజేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వర్దోలు ఐలయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు వర్ధన్ సాగర్ యాదవ్, నాయకులు గుండెల్లి పర్శరాములు యాదవ్, ముక్కర నరేష్, మహమ్మద్ రియాజ్, కీర్తి పోశాయ్య, భోగి శ్రీను, గీకూరు రాజు, వర్దోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## చిన్నారి గుండె అపరేషన్‌కు 6 యూనిట్ల రక్తం దానం



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం మరో ప్రాణానికి ఊపిరి పోయడమేనని హైందవ సోదరుడు కాశమైన సందీప్ అన్నారు. గురువారం బానుశ్రీ అనే చిన్నారికి బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో అత్యవసరంగా గుండె ఆపరేషన్ ఉందన్నారు. ఆపరేషన్‌కి 6 యూనిట్ల బ్లడ్ అవసరం పడిందన్నారు. గజ్వేల్ ప్రాంతంలో తనకు ఉన్న హైందవ సోదరులకు పాప తండ్రి, అన్న సంగమేశ్వర్‌లు విషయాన్ని తెలిపారన్నారు. వెంటనే స్పందించిన హైందవ సోదరులు పాజిటివ్ రక్తాన్ని ఇవ్వడానికి హైదరాబాదు బయలుదేరి వెళ్లారన్నారు. వెంటనే స్పందించి వచ్చినందుకు హైందవ సోదరులకు సంగమేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారన్నారు. డాక్టర్లు సైతం వారి స్పందనను చూసి కొనియాడారన్నారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతగా నిలుస్తున్నారన్నారు. సమాజంలో తమ సేవలను కొనసాగిస్తున్న హైందవ సోదరులను అందరూ ప్రశంసలతో కొనియాడారన్నారు. ఈ కార్యక్రమంలో నాయిని సందీప్, వేణు, సంతోష్, శ్యామ్, గణేష్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు

## కాంగ్రెస్ మండల కార్యదర్శిగా బండి సంపత్

- నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి చెందిన బండి సంపత్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా నియామకమయ్యారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల నాయకులతో కలిసి బండి సంపత్‌కు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో మండల కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండలం పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులకు బండి సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, ఉప సర్పంచ్ బండి వేణు, టౌన్ ప్రెసిడెంట్ బండిపెల్లి రాజు, శెట్టి రాజు, పులి సంతోష్, జెల్లా ప్రభాకర్, బైర సంతోష్, సూరం తిరుపతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన సోషల్ మీడియా కోఆర్డినేటర్లు



నవతెలంగాణ-అక్కన్నపేట

హైదరాబాదులోని మాదాపూర్ దర్పల్లా హోటల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ల మీటింగ్‌కు అక్కన్నపేట మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగ రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు అందించేలా చూడాలన్నారు. ఎలక్షన్స్ ప్రచారంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్లు చేసిన కృషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అలెక్స్, మంద పరశురాం, మహమ్మద్ రఫీ, గట్టు ప్రశాంత్, రమేష్, అజయ్ కుమార్, హరీష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం అపార నష్టం

- తడిసి ముద్దైన వరి ధాన్యం
- ఆందోళనలో రైతన్నలు



నవతెలంగాణ-మర్కుక్



మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి రైతులు పండించిన వరిధ్యానం తడిసి ముద్దైంది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు, 9 రెవెన్యూ గ్రామాలకు గాను యాసంగిలో రైతులు 7.200 ఎకరాలు వరి సాగు చేశారు. 40 శాతం వరి కోతలు కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారు. అంగడికిష్టాపూర్, ఎర్రవల్లి, శివారు వెంకటపూర్ గ్రామాలలో ఐకెపి కేంద్రం, మర్కుక్, దామరకుంట, ములుగు పీఏసీఎస్ కేంద్రం, వరదరాజ్ పూర్, చేబర్తి గ్రామాలలో జగదేవపూర్ పీఏసీఎస్ ద్వారా కొనుగోలు ఏర్పాటు చేశారు. గత వారంరోజులుగా వడ్ల అరబెసి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లే సమయంలోనే బుధ, గురువారాలలో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. దీంతో వరి ధాన్యం వర్షాలకు కొట్టుకుపోయాయి. ఇంకా 60 శాతం వరి కోతలు కోయాల్సివుంది. అకాల వర్షం వల్ల అరుకాలం శ్రమించి పండించి పంటలు నేల పాలు కావడంతో రైతు ఆందోళన చెందుతున్నారు.

## గ్రామాలలో వర్షానికి తడిసిన ధాన్యం





నవతెలంగాణ-తొగుట

మండలంలో అకాల వర్షానికి వివిధ గ్రామాలలో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. గురువారం మధ్యాహ్నం గాలివాన కురవడంతో ఐకేపీ కేంద్రాలలో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఇక్కట్లు పడ్డారు.

# లింగాపూర్ చెక్‌డ్యాంపై ఇంత నిర్లక్ష్యం ఎందుకు

- ప్రమాదకరంగా చెక్‌డ్యాం
- ఇబ్బందులు పడుతున్న రైతులు జెల్లగూడెం గ్రామస్తులు
- పదేళ్ల పాలనలో పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ పాలనలో నిర్మాణం జరిగేనా



నవతెలంగాణ-మద్దూరు

గత పది సంవత్సరాల క్రితం దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ వాగుపై నిర్మించిన చెక్ డ్యాం వర్షానికి కొట్టుకపోగా మరమ్మత్తులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పప్రమాదంగా మారి రైతులు ఇబ్బందులు పడుతున్న అధికారులకు పట్టడం లేదు. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలైనా నిర్మాణం చేయలేదని, దీంతో లింగాపూర్, జెల్లగూడెం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్న లింగాపూర్ చెక్ డ్యాం నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదని రైతులు, జెల్లగూడెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాగు జోరుగా సాగినప్పుడు. వాగు అవతల ఉన్న రైతులు తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదేవిధంగా లింగాపూర్ గ్రామ శివారు జెల్లగూడెం గ్రామస్తులు రేషన్ బియ్యం, పెన్షన్ తీసుకునేందుకు లింగాపూర్ గ్రామానికి రావాలంటే వాగు నుంచి రాలేక వారు కూడా 20 కిలోమీటర్ల దూరం నుండి లింగాపూర్‌కు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా లింగాపూర్ చెక్ డ్యాం నిర్మాణం పనులు త్వరగా చేయాలని గ్రామస్తులు కోరారు.

### వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



లింగాపూర్ చెక్ డ్యాం వర్షానికి కొట్టుకపోవడంతో తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే 20 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. వరి సాగు చేసేటప్పుడు మందు బస్తాలు తీసుకువెళ్లాలన్నా, కూలి వాళ్ళు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే చెక్ డ్యాం నిర్మాణం పనులు పూర్తి చేయాలి.

**ముక్క చంద్రయ్య, లింగాపూర్ గ్రామ రైతు**

### గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి చెక్ డ్యాంకు మరమ్మతులు చేయించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. 2019లో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రెండోసారి అధికారంలోకి రాగానే చెక్ డ్యాం నిర్మాణం పనులు చేయిస్తానని చెప్పి పది సంవత్సరాలు గడిచినా చేయలేదన్నారు. గ్రామస్తులమందరం ప్రజాప్రతినిధులకు, అధికారులకు, లింగాపూర్ చెక్ డ్యాం నిర్మాణం పనులు చేయాలని ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వమైన చెక్ డ్యాం నిర్మాణం పనులు చేయాలి.



**కోరండ్ల రామయ్య, లింగాపూర్ రైతు**

## మిరుదొడ్డి పిఎసిఎస్ కొనుగోలు కేంద్రంలో భారీ మోసం

- తూకంలో అవకతవకలకు పాల్పడుతున్న నిర్వాహకులు
- ఒకే కేంద్రంలోని రెండు తూకం యంత్రాలలో వేరువేరుగా ధాన్యం బస్తాల వ్యత్యాసాలు
- క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున అదనంగా దండుకుంటున్న పిఎసిఎస్ నిర్వాహకులు
- రైస్ మిల్లర్లతో సీఈఓ రాజు ఒప్పందం చేసుకున్నట్లు రైతుల ఆరోపణ
- కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు లేక మండుటెండల్లో రైతుల ఇబ్బందులు
- ఈ కొనుగోలు కేంద్రంలోనే వడదెబ్బతో ఓ రైతు మృతి చెందిన సంగతి తెలిసిందే





నవతెలంగాణ-మిరుదొడ్డి

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండల కేంద్రంలోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులు అన్నదాతలను మోసం చేస్తున్నట్లు రైతులు ఆరోపించారు. కొనుగోలు కేంద్రంలోని తూకంలో బస్తాల వ్యత్యాసం ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. ఓ రైతుకు చెందిన 41 కిలోల ధాన్యం బస్తాను తూకం వేశారు. రైతుకు తూకం విషయంలో అనుమానం రావడంతో అదే కేంద్రంలోని మరోతూకంపై అదే బస్తాను తూకం వేస్తే 42.350 కిలోలు వచ్చింది. ఒకే కేంద్రంలో ఉన్న రెండు తూకం యంత్రాల్లో కిలోన్నర వ్యత్యాసం ఉండడముతో రైతులు ఒక్కసారిగా నిర్ఘాంత పోయారు. రోజుకు కొన్ని వేల కిలోల చొప్పున రైతుల నుంచి దోపిడికి గురి చేస్తున్న నిర్వాహకులైన సీఈఓ రాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పిఏసిఎస్ సిబ్బంది రైతులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణ వినిపిస్తున్నాయి. రైస్‌మిల్ యజమానులతో కుమ్మక్కై పిఏసిఎస్ కార్యదర్శి రాజు మరి ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తూ ధాన్యాన్ని ఎక్కువగా తూకం చేయడం జరుగుతుందని, రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కమలాకర్ రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షంతో తడుస్తున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పిండ్లను ప్రైవేటు వ్యక్తుల దగ్గర అద్దెకి తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఒక్కో టార్పలిన్ రూ. 30 నుంచి రూ. 50 చొప్పున అద్దెకు తీసుకుంటున్నారు. ఇలా ఒక రైతు తన ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం నాలుగు నుంచి ఐదు టార్పలిన్‌లను ప్రైవేట్ వ్యక్తుల దగ్గర నుంచి అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రంలో సుమారు 7 నుంచి పది రోజుల వరకు ధాన్యం విక్రయించడానికి వేచి చూడాల్సి వస్తుందన్నారు. దీంతో టార్పలిన్‌లకే రూ 1000 నుంచి 1500 వరకు ఆర్థిక భారం పడుతుందన్నారు. మండుటెండల్లో కేంద్రాల్లో కనీసం టెంట్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల నీడన తలదాచుకుంటున్నామని రైతులు బోరున విలపించారు. తూకంలో వ్యత్యాసం ఉన్న విషయాన్ని నేరుగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అన్నదాతలు వడదెబ్బతో మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన యాదగౌడ్ వడదెబ్బతో మృతిచెందడం బాధాకరమన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## భారత రాజ్యాంగ రక్షణకు ఐక్య ఉద్యమం

- మాలల జెఏసి చైర్మన్ చెరుకు రాంచందర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం చేపట్టాలని మాలల జెఏసి రాష్ట్ర చైర్మన్ చెరుకు రాంచదర్, వివిధ రాష్ర దళిత సంఘాల నేతలు మందాల బాస్కర్, తాళ్ళపల్లి రవి, పి.శంకర్‌లు అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం లింగుపల్లిలో మాలల జెఏసి, మాల మహానాడు, ఓయు జెఏసి, డిబిఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రక్షణ మన కర్తవ్యంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలల జెఏసి చైర్మన్ చెరుకు రామచందర్, మాలమహనాడు జాతీయ అధ్యక్షుడు తాళ్ళ పల్లి రవి, ఓయు జెఏసి చైర్మన్ మందాల బాస్కర్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్‌లు మాట్లాడుతూ డాక్టర్ బి.అర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం, ప్రజలందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించిన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి కుట్ర చెస్తుందన్నారు. మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన మనుధర్మ శాస్త్రాన్ని తిరిగి అమలు చేయడం వల్ల బానిసత్వం, అమానుషసత్వం పెరిగిపొతుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని గాలికి వదిలి అధికారం కొరకు విద్వేషాలు రెచ్చగొడుతూ, సమాజాన్ని విచ్చిన్నం చేసే ప్రయత్నాలు చేస్తున్న మోడిని గద్దె దిగడం ఖాయమన్నారు. గత నాలుగు దశలుగా జరిగిన ఎన్నికలలో ప్రజలు విద్వేషాలను రగిలించిన బీజేపీకి ఓటు ద్వారా గుణ పాఠం చెప్పబొతున్నారన్నారు. గత పదేళ్ళుగా అభివృద్ధిని విస్మరించి ప్రజల మధ్యన విద్వేషాలను రెచ్చగొట్టడం తగదన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్‌లను ఎత్తివెస్తామని పదేపదే ప్రకటించడం తగదన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రూ.12 లక్షల కోట్లను వసూలు చేసి రాష్ట్రానికి నిధలు ఖర్చు చేయలేదన్నారు. కార్పొరేట్ల అప్పులను రద్దు చేయడం ద్వారా రూ.16 లక్షల కోట్లను అదాని, అంబానీలాంటి కంపెనీలకు దొచిపెట్టారన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారి దేవుళ్ళ పేరుతో ఓట్లను అడగటం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నేతలు తుమ్మ శ్రీనివాస్, కృపాకర్, జె.బాల్ నర్సు, బి.శంకర్, పి.కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీల పేరిట కాంగ్రెస్ మోసం

- క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

6 గ్యారంటీల పేరిట కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేసిందని, ఎన్నికలకు ముందు క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పి, నేడు సన్నం వడ్లకే ఇస్తామంటూ మెలికలు పెట్టడం కాంగ్రెస్ మూర్ఖపుపాలనకు నిదర్శమని దుబ్బాక ఎమ్మెల్యే బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. ఆరు నెలల కాంగ్రెస్ పాలన పట్ల తెలంగాణ ప్రజానీకం ఛీత్కరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకలో బస్టాండ్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ సర్కార్ హయాంలో అనేక ప్రాజెక్టులు నిర్మించి కాలువల ద్వారా పంట పొలాలకు నీటిని అందించామని. కేసీఆర్ పాలనలో రైతులు, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చిన ఆరు నెలల్లోనే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో రైతులు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ ధర్నాలో జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, ఎంపీటీసీ ఎల్.రాంరెడ్డి, బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, నియోజకవర్గ మండలాధ్యక్షులు వంశీకృష్ణ గౌడ్, బాణాల శ్రీనివాస్, జీడిపల్లి రవి, నాయకులు రొట్టె రాజమౌళి, గన్నె భూమ్ రెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, బండి రాజు, ఖలీల్, డాక్టర్ చింతల కృష్ణ, సంఘం ప్రభాకర్, పడాల నరేష్, మగ్బూల్, హార్డ్ వర్కర్ పండు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దంచి కొట్టిన వాన. ధాన్యమంతా పాడు

- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో భారీ వర్షం
- రోడ్లపై ఆరేసిన వరి ధాన్యం తడిసి ముద్ద
- లబోదిబో మంటున్న రైతులు, అకాల వర్షానికి ఆస్తి నష్టం





నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గురువారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురవడంతో పంట పొలాల్లో ఉన్న వరి ధాన్యం రోడ్ల పైన ఉన్న వరి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసి ముద్దులయ్యాయి. ఈ అకాల వర్షానికి రైతులు ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. పంట పొలాల్లో కాకుండా పట్టణంలోని లక్ష్మీప్రసన్న కాలనీ, తూప్రాన్ రోడ్, దిల్వాలే హోటల్ గల్లీలలో ఎడతెరపు లేకుండా కురిసిన వర్షానికి వాహనాలు ధ్వంసం అయ్యాయి. అటు ప్రజ్ఞాపూర్, గుండన్నపల్లి రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. లక్ష్మీప్రసన్న కాలనీలో గాలులతో వచ్చిన వర్షానికి సుమారు పది కార్లు ధ్వంసమైనట్లు సమాచారం. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడం భారీ నుంచి అతి భారీ వర్షానికి దారి తీయడం ఆస్తి నష్టానికి కారణమయ్యింది. ఎడతెరిపి లేకుండా సుమారు మూడు గంటల పాటు వర్షం దంచికొట్టింది. గజ్వేల్‌లో జోరు వర్షానికి విరిగిన చెట్లు నిలిపి ఉన్న వాహనాల మీద పడగా (తూప్రాన్ రోడ్ )లో ఒక కాలనీలో వాహనాలు ధ్వంసం అయ్యాయి. లక్ష్మీ ప్రసన్న నగర్‌లో డ్రైనేజ్ పొంగి పోర్లింది. పట్టణవాసులు అకాల వర్షానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులపై, సీసీ రోడ్ల పైన వరదనీరు ఏరులై పారింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కారు మబ్బులు కమ్మిన చీకటితో వర్షం కురవడంతో ప్రతి ఒక్కరు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్ అన్నట్లుగా రోడ్లు నిర్మానుషంగా మారాయి.

## విద్యార్థినిపై యాసిడ్ ఘటనపై విచారణ చేపట్టాలి

- ఇక్ ఫాయ్ యూనివర్శిటీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శి ఆముదల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్

నవతెలంగాణ-సిద్దిపేట

హైదరాబాద్ ఇక్ ఫాయ్ యూనివర్శిటీలో లా ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న లేఖ్యపై యాసిడ్ దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఆముదల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఇక్ ఫాయ్ ప్రైవేటు యూనివర్శిటీ విద్యార్థుల నుంచి లక్షల రూపాయల వసూళు చేయడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థులు రక్షణపై లేదని విమర్శించారు. విద్యార్థులపై ర్యాగింగ్ ఈ యూనివర్శిటీలో జరుగుతున్న, కనీసం యాంటి ర్యాగింగ్ చర్యలు యూనివర్శిటీ యాజమాన్యం తీసుకోవడం లేదన్నారు. బకెట్‌లో యాసిడ్ పోసి ప్రాణాలు తీసే చర్యలు తోటి విద్యార్థులు చేశారంటే యూనివర్శిటీలో విద్యార్థులు రక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించాలని, విద్యార్థులు సంక్షేమం గాలికి వదిలేసిన యూనివర్శిటీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందన్నారు. గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.

## బండి సంజయ్‌దే విజయం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-అక్కన్నపేట

కరీంనగర్ పార్లమెంటులో బండి సంజయ్ విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు డబ్బులు, మ ద్యంతో ప్రజలను ప్రలోభాలకు గురిచేసిన ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మ రథం పట్టారన్నారు. సంజయ్‌ను గెలిపించడం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, బీజేవైఎం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, బిజెపి నాయకులు తిరుపతి నాయక్, మాజీ సర్పంచ్‌లు బానోత్ రవీందర్, లావణ్య కుమార్, ఎల్లన్న ఎస్ టి మోర్చా మండల అధ్యక్షుడు సురేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు మిట్టపల్లి కుమార్, భూక్య తిరుపతి, సుధాకర్ నాయక్, ప్రవీణ్, కళ్యాణ్, సుమన్ నాయక్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త మృతి

- అంత్యక్రియల్లో దుబ్బాక ఎమ్మెల్యే



నవతెలంగాణ-రాయపోల్

బీఆర్ఎస్ కార్యకర్త బ్యాగరి శివకుమార్ (23) బుధవారం సాయంత్రం గుండెపోటుతో ఆకస్మిక మరణం రాయపోల్ గ్రామ వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. మండల కేంద్రానికి చెందిన బ్యాగరి శివకుమార్ బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ, పార్టీలో ముఖ్యులుగా ఎదుగుతున్నాడు. దళిత, బహుజన ఉద్యమాలు, అనేక కార్యక్రమాలలో చురుకుగా ఆసక్తిగా పాల్గొనేవాడు. ఇటీవల జరిగిన సాధారణ శాసనసభ ఎన్నికలలో పార్లమెంటు ఎన్నికల్లో ఎంతో చురుకుగా పాల్గొని, బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ముమ్మారంగా ప్రచారం నిర్వహించారు. ఆ ప్రచారంలో చురుకుగా పాల్గొని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు అధిక ఓట్లు వచ్చే విధంగా కృషి చేశాడు. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఆకస్మిక మృతి చెందడం గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. శివకుమార్ గ్రామంలో అందరితో కలుపుగోలుపుగా ఉంటూ ఎంతో ప్రేమ ఆప్యాయతగా మాట్లాడేవాడు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించగా దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివకుమార్ ఇంత చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించడం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధైర్య పడవద్దు కుటుంబాన్ని ఆదుకుంటానని భరోసా కల్పించారు. తక్షణ సహాయం కింద కుటుంబ సభ్యులకు రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. చిన్న వయసులోనే శివ కుమార్ మరణించడంతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయి విషాదఛాయలు అలుమకున్నాయి. అంతిమయాత్రలో అశేష జనం పాల్గొని ఘన నివాళి అర్పించారు.

